

# హైదరాబాద్ వార్త

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించాలి : ఎంపి ఈటల



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఈటెల రాజేందర్

**ధర్నాచౌక్, ఆగస్ట్ 25, ప్రభాతవార్త:** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మధ్యవర్తుల దోపిడీ లేకుండా ఏజెన్సీ రద్దు చేసి, నేరుగా కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపిన ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఏ విధంగా ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తున్నారో అదేవిధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మొదటి తేదీనే వేతనాలు ఇవ్వాలని సూచించారు. ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారని ఆశతో ఇరవై సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య భద్రత ఇస్తూ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి బొల్లం గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు కల్పించాలని, గవర్నమెంట్ నోటిఫికేషన్‌లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో మరణించిన ఉద్యోగి కుటుంబానికి పది లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అన్ని శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు సెలవలు 15 నుండి 30 వరకు పెంచాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మానవతారాయ్, ఐఎన్‌టియూసీ నాయకులు పద్మ ధర్నాకు మద్దతు తెలిపి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్య క్షులు పులి లక్ష్మయ్య, నాయకులు కొటాల సంతోష్ కుమార్, జే.వినోద్, కే.విజయలక్ష్మి, జే.సంధ్య, డి.శ్రీధర్, జే.కృష్ణ, ఎండి నజీర్, ఎం.జగదీష్, జీ.అరుణ్‌కుమార్, బిందు ప్రసాద్, టీ.నారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించే బాధ్యత అధికారులదే

**టిప్పర్లతో డంప్ చేసిన రాళ్లను తరలించేదెవరు..?**
**సర్వే నెంబర్ 186లో పూడ్చివేతలో ఆంతర్యమేమిటి..**
**ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించే బాధ్యత అధికారులకు పట్టదా.. జరిమానాలతో సరిపెడతారా..**
**రక్షణ చర్యలు తీసుకుంటారా..**
**నిజాంపేట్ రెవెన్యూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం..**



ఖాళీ ప్రదేశంలో డంప్ చేసిన వేస్టేజ్

**నిజాంపేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త** ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించే బాధ్యత అధికార యంత్రాంగానికి ఉంటుంది. గుట్టుచప్పుడు కాకుండా రాళ్ళతో డంప్‌చేయడం వెనుక ఆంతర్యమేమిటని, అనేక ప్రశ్నలకు తావిస్తుంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సర్వే నెంబర్ 186 ప్రభుత్వ స్థలంలో ఇటీవల భవన నిర్మాణ వృధా మెటీరియల్ (కన్‌స్ట్రక్షన్ వేస్టేజ్ మెటీరియల్) గాజులరామారం, సూరారం, షైసర్‌నగర్‌ల నుండి నివాస యోగ్య ప్రాంతాలకు దగ్గరలో డంప్ చేస్తుండగా 5 లారీలను బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. అంతేకాకుండా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఒక్కో లారికీ 10వేల చొప్పున మొత్తం ఐదు లారీలకు 50వేల జరిమానా విధించారు. ఇప్పటివరకు బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ స్థలంలో రాళ్లను మట్టిని పోసేంతవరకు వచ్చిందంటే ఆ స్థలాన్ని పరిరక్షించడంలో అధికారుల చిత్తశుద్ధి తేటతెల్లంగా మారిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోసిన మట్టి, రాళ్ల కుప్పలను ఎత్తడంలో ఎవరు చర్యలు తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోసిన మట్టి, రాళ్ల కుప్పలను ఎత్తడంలో ఎవరు చర్యలు తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించే విషయంలో అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో ముందుకు రావలసిన అవసరం ఉందని బీజేపీ నేత ఆకుల సతీష్ డిమాండ్ చేస్తున్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, వేముల రామకృష్ణ

## హాస్టళ్ల మెస్, అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించండి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపి.ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** బిసి కాలేజీ హాస్టళ్ల మెస్, అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని, విదేశీవిద్యా స్టైఫండ్ అర్హులందరికీ ఇవ్వాలని, బిసి, ఎస్‌సి, ఎస్టీ ఈబిసి ఫీజుల బకాయిలను 5వేల కోట్లు చెల్లించాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్.కృష్ణయ్య మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈమేరకు మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 10నెలలుగా బిసి హాస్టళ్లలో మెస్‌బిల్లులు, సంవత్సరం నుంచి అద్దె భవనాల బిల్లులు, కరెంట్‌బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీనిమూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూరగాయలు, మాంసం, గుడ్లబిల్లులు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులకు కూడా గత ఐదునెలలుగా చెల్లించలేదని దీంతో హాస్టళ్లకు కూరగాయలు ఇతరవస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అప్పులపాలపై సరఫరా నిలిపివేస్తున్నారన్నారు. దీనిమూలంగా హాస్టళ్లు మూసేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో దాదాపు అన్ని బిసి హాస్టళ్లు అద్దెభవనాల్లోనే ఉన్నాయని ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే యజమానులు ఖాళీ చేయాలని తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. కావున వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు పాస్ చేయాలని మంత్రిని కోరామన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, రాందేవ్ పాల్గొన్నారు.

### 25 పబ్బులు, బార్లలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పబ్బులు, బార్లలో డ్రగ్స్‌ను అరికట్టడానికి ఎక్సైజ్‌శాఖ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. వారం రోజుల్లో 25పబ్బుల్లో తనిఖీలు నిర్వహించగా ఈవీకెండ్ శనివారం రాత్రి పదిగంటల నుంచి హైదరాబాద్ రంగారెడ్డిలోని 25బార్లు, పబ్బులను ఆకస్మిక తనిఖీ చేపట్టింది. తనిఖీలతోపాటు డ్రగ్స్ డిటెక్టర్‌తో పబ్బుల్లోకి వచ్చిన వాళ్లకి స్పాట్ కిట్స్ పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల్లో ఎవరికీ పాజిటివ్ రాలేదు. ఈసందర్భంగా ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ,ఎస్టీఎఫ్, డిటిఎఫ్ ఇతర పోలీస్ బృందాలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఒకొక్క టీం ఒకొక్క పబ్బుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈదాడుల్లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, హైదరాబాద్, రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్.కిషన్, డిఎస్పీ తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

## విహెచ్‌కు ఎడ్ల సుధాకర్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

### కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ రాజ్యసభ సభ్యులు అయిన వి.హనుమంతరావుపై ఎడ్ల సుధా కర్‌రెడ్డి విమర్శలు చేయటం తగదని, తక్షణమే సుధాకర్‌రెడ్డి వీ హను మంతరావుకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మ కుంట మీద వి.హనుమంతరావు హైడ్రాకు ఫిర్యాదు చేస్తే ఎడ్ల సుధాకర్ రెడ్డి ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. విద్యార్థి దశనుండే రాజకీయాలలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న హనుమంతరావుపై పది సంవత్సరాల క్రితం రాజకీయాలలోకి వచ్చిన వ్యక్తి విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తక్షణమే ఎడ్ల సుధాకర్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షం కాంగ్రెస్ కార్యకర్తలు కలసి సుధాకర్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## 'కేంద్రం ఏకీకృత పెన్షన్' సరికాదు

### టిసిపిఎస్‌ఈఏ నేతలు కృష్ణకుమార్,హనుమాండ్ల భాస్కర్

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** కేంద్రం ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్) ప్రకటన సరికాదని ఈవిధానం ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని టిసిపిఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హాన్మాండ్ల భాస్కరన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. చెందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దుచేసే విషయాన్ని ప్రస్తావించకుండా 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారెంటీ ఉంటుందని సర్వీస్‌లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60శాతం పెన్షన్ ఇస్తామని వెల్లడించడం శోచనీయమన్నారు. యుపిఎస్ కాకుండా పాతపెన్షన్ విధానం లోప భూయిష్టంగా ఉందని యుపిఎస్ అమలు ప్రకటనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలోచన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించే పరిస్థితి ఉంటుందని తద్వారా ఉద్యోగులకు వారి కుటుంబా లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. తెలంగాణలో సిపిఎస్ రద్దు కోసం కాంగ్రెస్ మేనిఫెస్టో స్పష్టమైన హామీ ఇచ్చిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగులను వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## టీనేజీ...డ్యామేజీ...

**పదిలోనే పబ్‌వైపు పరుగులు**
**విద్యార్థి దశలోనే మద్యానికి బానిస**
**పబ్‌లకు వెళ్లేవారిలో మైనర్లే ఎక్కువ**
**తల్లిదండ్రులు మేల్కొనపోతే పెనుప్రమాదమే..**



**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** మద్యం మత్తులో బాల్యం చితికిపోతుంది.. కేవలం యువకులు, ఆపైబడిన వయసున్న వారే మద్యానికి బానిసలయ్యారనే పరిస్థితులు నేడు మారిపోయాయి. మందు తాగడం ఓ హాబీగా తయారైంది. ఇద్దరు కలిస్తే సిగరేట్.. నలుగురు కలిస్తే మందు అన్నట్లు ఉంది ప్రస్తుత పరిస్థితి. అయితే ఈవ్యసనమనే జాడ్యం పాఠశాల విద్యార్థులకూ అంటుకోవడమే ప్రస్తుతం నగరాన్ని వణికింపజేస్తున్న పరిణామం. విదేశీ అలవాట్లును ఒకరిని చూసి మరోకరు నేరు ్చకుంటున్నారు. పాశ్చాత్త దేశాల సంప్రదాయాలు చాలా వరకు మనదేశ యువతను పెడదారి పట్టిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**విద్యార్థిదశలోనే పబ్‌ల వెంట....**

చక్కగా చదువుకోవాల్సిన వయస్సులో కాక్‌టెయిల్ రుచిమాస్తూ పబ్‌ల వెంట తిరుగుతున్నారు మైనర్లు. ఈ సంస్కృతి నగరాల్లో విపరీతంగా పెరిగిపోయింది. తల్లిదండ్రులు తమ పనుల్లో బిజీగా ఉండటం, పిల్లలు అడిగినంతా పాకెట్‌మనీ ఇవ్వడం, వారు ఎప్పుడు ఇంటికి వస్తున్నారో.. ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకునే పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేకపోడంతో ఈపరిస్థితి నెలకొంటుంది. ఆదివారం నగరంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపినప్పుడు ఓపబ్‌లో సగానికిపైగా మైనర్లు అక్కడి నుండి పారిపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ముంబై, బెంగళూర్, హైదరాబాద్ సిటీల్లో బాలుడి చేతిలో బీరుబాటిళ్లు కామన్ అయిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. బీరు బాటిళ్ళు పట్టుకునే టీనేజర్ల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇక న్యూఇయర్, బర్త్‌డే పార్టీలు వస్తే చాలు ఆరోజు డబుల్ ధమాఖానే అంటున్నారు టీనేజర్లు. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా మద్యం సేవించడం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యు హెచ్‌ఓ) లెక్కల ప్రకారం దేశంలో 15 ఏళ్ల వయస్సు 70 శాతం మంది బాలబాలికలు ఇప్పటికే లిక్కర్ టేస్ట్ చూశారని చెబుతుంది. గడిచిన 20 సంవత్సరాల్లో ఇండియాలో మద్యం వినియోగం 55శాతం పెరిగిందని తెలిపింది. లిక్కర్ టేస్ట్ చూసే వయస్సు కూడా తగ్గిందని పారిస్‌కు చెందిన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక స్పష్టం చేస్తోంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూర్, చెన్నై, ముంబై, గోవా, ఛండీఘర్, ఢిల్లీలలో 14ఏళ్ల దాటిన చిన్నారులు ఆల్కహాల్ రుచి సూస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎక్కువగా బాలురు ఉన్నారని తెలిపారు. ఈ పిల్లలు ఎప్పుడెప్పుడు మందు కొట్టేది తెలియజేశారు. చిరాగ్గా ఉన్నప్పుడు, అప్‌సెట్ అయినప్పుడు మందు కొడతారని 52శాతం టీనేషర్లు ఓపెన్‌గానే చెప్పేసు_న్నట్లు నివేదికలో వెల్లడించారు. 2శాతం మందయితే ఏపనిలేక బోర్ కొట్టినప్పుడు తాగుతున్నట్లు నివేదికలో వెల్లడైంది. అన్నింటికంటే డేంజర్ విషయం ఏంటంటే కేవలం కిక్‌కోసమే 47శాతం టీనేజర్లు మందు కొడుతున్నట్లు సమాచారం. డబ్బులు ఎలా అని అడిగితే పాకెట్‌మనీ అని చెబుతున్నారు. ఒక న్యూఇయర్, బర్త్‌డే పార్టీకే ఒక్కో టీనేజర్ రూ.2వేల నుండి 10వేల రూపాయల ఖర్చు చేస్తున్నట్లు సర్వేలో స్పష్టం అయ్యింది. చిన్న వయస్సులో మద్యం తాగటం వల్ల మెదడు పనితీరు, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని డాక్టర్లు చెబుతూన్నారు.



సేవ్‌లేక్స్ ర్యాలీలో పాల్గొన్న ఎంజిఐటికళాశాల లెక్చరర్లు, విద్యార్థుల

## చెరువులను కాపాడుకుందామంటూ ర్యాలీ

**నార్సింగి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** భావి తరాల కోసం సహజ సంపద అయిన చెరువులు, కుంటలు, నదులు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గండిపేట చెరువు వద్ద ఎంజిఐటి కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు "సేవ్ లేక్స్" పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మనం చేస్తున్న తప్పిదాల వలన భావితరాల పౌరులకు మంచినీరు కూడా మిగులడం కష్టమవుతుందన్నారు. చెరువులు, కుంటలు, నదులు జల సిరులన్నీ ప్రకృతి ప్రసాదాలని, వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతీ పౌరుడు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైనేజీలను చెరువులలో, నదులలో కలుపడం వలన మురికి కూపాలుగా మారుతున్నాయన్నారు. హుస్సేన్ సాగర్‌ను ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించారని, ఇప్పుడది కాలుష్య కాసారంగా మారిపోయిందన్నారు. రాజధాని హైదరాబాద్ లో ఉన్న గొలుసుకట్టు చెరువులన్నీ కబ్జాలతో చిక్కిపోయాయని, మురికి కూపాలు గా మారాయన్నారు. దశాబ్దాల పాటు హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్న జంట జలాశయాలైనా గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాలు మరో హుస్సేన్ సాగర్‌లా మారకుండా పాలకులు పకడ్బంధీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ మాత్రం అజాగ్రత్తను వహించినా సమీప భవిష్యత్తులో ఈ రెండు భారీ చెరువులు కూడా మురికి కుంటలుగా మారడం ఖాయంగా కనిపిస్తుందన్నారు. జలాశయాలలోకి చెత్త, చెదారం, డ్రైనేజి కలువకుండా, వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరద నీరు మాత్రమే కలిసేలా పకడ్బంధీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ సత్య శేఖర్‌వర్మ పాల్గొన్నారు.

## సామూహిక కుంకుమార్చన పూజలు

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరి నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ, మీర్‌పేట్ శ్రీ గాయత్రి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక సహస్ర నామ కుంకుమార్చన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమార ్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు వెంకట కృష్ణారావు, వెంకటరమణ, గాయత్రీ సేవా సంఘం సభ్యులు శ్రీనివాస ప్రసాద్, శివరామ ప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మీ నర్సింహమూర్తి, ఆకెళ్ళ మూర్తి, బాపిరాజు, రామచంద్రరావు, పార్థసారథి, ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు, పురోహితుడు కృష్ణశర్మ పాల్గొన్నారు.



పోలీసు బలగాలకు సూచనలు ఇస్తున్న మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి

## బాలాపూర్ పిఎస్ పరిధిలో కార్డన్ సెర్చ్

### రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో తరచూ హత్యలు జరుగుతున్న బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరగాళ్ళ కదలికలు, అసాంఘిక కార ్యకలాపాలు తదితర వాటిపై ఆరా తీసి ప్రజల్లో అభద్రతా భావాన్ని తొలగించే నిమిత్తం పోలీసులు కార్డెన్ సెర్చ్(కట్టడి ముట్టడి) నిర్వహించారు. ఈ మధ్య కాలం లో పిఎస్ పరిధిలో పలు హత్యలు జరిగిన నేపథ్యంలో స్పందించిన రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ జరిపారు. పిఎస్ పరిధిలో అనుమానాస్పద ప్రాంతమైన రాయల్ కాలనీ, బర్మా శరణార్థులు నివసిస్తున్న ప్రాంతంలో మహేశ్వరం జోన్ డిసిపి సునీతారెడ్డి నేతృత్వంలో కట్టడి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి అడిషనల్ డిసిపి జి.సత్యనారాయణ, ఎసిపి పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ భూపతిలతో పాటు మహేశ్వరం జోన్ పరిధిలోని పలువురు ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో కార్డెన్ సెర్చ్ జరిపారు. దాదాపు 280 మందికి పైగా పోలీసులతో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 63 వాహనాలను, 3 ఆక్సిటోసిన్ స్టెరాయిడ్ బాటిళ్ళను స్వాధీనంచేసుకున్నారు. అనుమానాస్పదస్థితిలోఉన్న ముగ్గురితో పాటు మరో ముగ్గురు రౌడీషీటర్లను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. కార్డెన్స్ సెర్చ్ సందర్భంగా డిసిపి స్థానికులతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు.

## ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి : ఎసిపి చంద్రశేఖర్



మాట్లాడుతున్న చార్మినార్ ఎసిపి చంద్రశేఖర్

**చార్మినార్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను జరుపుకుని తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని చార్మినార్ ఎసిపి పి.చంద్రశేఖర్ కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం చార్మినార్ చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో గణేష్ మండపాల నిర్వాహకులతో కలిసి నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిదిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండపాల నిర్వాహకులు మండపాల వద్ద చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.చంద్రశేఖర్, డిఐ బ్రహ్మ మురారీ, ఎస్‌ఐలు, గణేష్ మండ పాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## మళ్లీ పెరుగుతున్న సైకిల్ సవారీ

### వ్యక్తిగత ప్రయాణంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త** రిమ్‌జిమ్ హైదరాబాద్.. సైకిల్‌వాలా జిందాబాద్ అంటున్నారు సిటీజనులు. అటు ఆరోగ్యం.. ఇటు ఆహ్లాదానికి సైకిల్ సవారీని మించింది ఏముంది అని కిలోమీటర్ల కొద్దీ సైకిల్ తొక్కేస్తున్నారు. ప్రతిరోజూ సైకిల్ సవారీకి సై అంటున్నారు. హ్యాపీగా.. జాలీగా.. సైక్లింగ్ చేయిరా.. అంటూ ఇప్పుడు నెక్లెస్ రోడ్డు మీదుగా వెళ్లేవారు పాడుకుంటున్నారు. ఓవైపు హుస్సేన్ సాగర్.. మరోవైపు పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం వెల్లివిరుస్తున్న నెక్లెస్ రోడ్డుకు ఇరువైపులా ఆరు కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ఉదయం, సాయంత్రం వేళలో చాలా మంది సైకిల్ ట్రాక్‌పై సైక్లింగ్ చేస్తున్నారు. వీకెండ్ శని, ఆదివారాల్లోనైతే వందల సంఖ్యలో సైక్లిస్టులు కనిపిస్తున్నారు. గుంపులు గుంపులుగా వ్యక్తిగత ఆరోగ్య ప్రయాణానికి జై కొడుతున్నారు. సొంత వాహనాలు బైక్‌లు, కార్లలో తమ పనుల కోసం వెళ్తున్నారు. అదేస్థాయిలోనూ సైకిల్‌పై వెళుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా జిమ్స్, ఫిట్‌నెస్ సెంటర్లకు వెళ్లడం అంతగా క్షేమకరం కాదనే ఉద్దేశంతో సైక్లింగ్‌కు ఓటేస్తున్నారు. ఓవైపు సురక్షితం.. మరో వైపు ఆరోగ్యదాయకం..ఇలా ఉభయదారకంగా భావిస్తూ సైక్లింగ్ ప్రియులు పెరుగుతునన పరిస్థితులు సిటీలో కనిపిస్తున్నాయి. ఈ క్రేజ్‌ను అందిపుచ్చుకుంటూ ఆయా ప్రాంతాల వారీగా వివిధ సైక్లింగ్ క్లబ్‌లు కూడా సైకిల్స్‌ను అద్దెకు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఐటీ కారిడార్‌కు దగ్గరగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు మార్గంలో 25 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్ నిర్మించాలన్న హెచ్ఎండిఎ ప్రతిపాదన మరోసారి తెరమీదకు వచ్చింది. 15 మీటర్లతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సైక్లింగ్ ట్రాక్ నిర్మించాలనే అంశంపై ఇంజనీరింగ్ విభాగం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

**సైక్లింగ్‌తో యాక్టివ్‌నెస్....**

- మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుంది.
- మోకాళ్లు, మోచేతులు, జాయింట్స్ అన్ని ఫిట్‌గా ఉంటాయి.
- కండరాలు బలపడతాయి.
- ఆజీర్తి వంటి సమస్యలు తొలగి ఆకలి పెరుగుతుంది.
- చెమట బయటికి రావడం వల్ల చర్మకాంతి మెరుగు పడుతుంది.
- రక్తనాళాలు, ఇతర భాగాల్లో ఏర్పడిన కొవ్వు కరిగి అధిక బరువు సమస్య ఉండదు.
- గుండె పనితీరు మెరుగుపడి రక్త ప్రసరణలో ఇబ్బందులు లేకుండా చూస్తుంది.
- శ్వాస నాళాల పనితీరు మెరుగు పడుతుంది.
- ఇప్పటికే కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఎక్కువ దూరం సైక్లింగ్ చేయడం మంచిదికాదు.
- సైక్లింగ్ చేసేవారు సంమృద్ధిగా మంచినీరు తీసుకోవాలి. లేదంటే డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది.

**ఎక్కడెక్కడ అనువుగా ఉన్నాయంటే....**

- నగరలో సైక్లింగ్‌కు చాలా ప్రాంతాలు అనువుగా ఉన్నాయి.
- బయోడైవర్సిటీ కాంప్లెక్స్ నుంచి మైండ్‌స్పేస్ వరకు..
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని వేవ్‌రాక్
- దుర్గంచెరువు పరిసర ప్రాంతాలు, బొటానిక్ గార్డెన్, శిల్పారామం రోడ్డు, గచ్చిబౌలి స్టేడియం.
- మణికొండ, కర్మన్‌ఘాట్, నాగోలు, కుత్బుల్లాపూర్, జేఎన్‌టియూ హైటెక్‌సిటీలలో ప్రాంతాల్లో నగరవాసులు సైక్లింగ్ చేస్తున్నారు.
- అనువైన మరిన్ని ప్రాంతాల్లోనూ సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మిస్తే నగరవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సైక్లిస్ట్‌లు అంటున్నారు.

**ఇవీ పాటించాలి....**

- హైగేర్‌లో ఎక్కువ సేపు పెడలింగ్ చేస్తే అది మోకాళ్ల మీద ఒత్తిడి పెంచుతుంది.
- వెనుక నుండి వచ్చే వాహనాల హారన్స్ మీకు వినబడాలి కాబట్టి..హెడ్ ఫోన్స్ పెట్టుకుని సైక్లింగ్ చేయకండి.
- తప్పనిసరిగా బైక్ తరహాలోనే హెల్మెట్ ధరించే సైక్లింగ్ చేయాలని గుర్తుంచుకోండి.
- పిల్లలకు కూడా సైక్లింగ్ అలవాటు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని సైక్లింగ్ క్లబ్ ప్రతినిధులు అంటున్నారు.

**బిపి, మధుమేహం దూరం : డాక్టర్ ధనుంజయ**

రెగ్యులర్‌గా సైక్లింగ్ చేస్తే బిపీ,, షుగర్ దరిచేరదు. గత ఆరేళ్లుగా నేను సైక్లింగ్ చేస్తున్నా..ప్రతి రోజు గంటకు పైగా సైక్లింగ్ చేయడమే కాకుండా ఇంటి అవసరాలకు, నిత్యావసర సరుకుల సేకరణకు కూరగాయల కొనుగోళ్లకు సైకిల్ ఎక్కువగా వాడుతున్నా. నగరంలో మరిన్ని సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలి.



పతకాలు అందజేస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## క్రియేటివిటీతో పెయింటింగ్స్ వేయడం గొప్పకళ

**-చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**అత్తాపూర్ ఆగస్టు 25, ప్రభాతవార్త :** క్రియేటివిటీతో పెయింటింగ్స్ వేయడం ఎంతో గొప్పకళ అని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హైదరగూడ సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై ఫ్రాగ్రాన్స్ ఆఫ్ ఆర్ట్ బడ్స్ ఇంటర్నేషనల్ చైల్డ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం పలువురు గీసిన చిత్రలను తిలకించి అభినందించారు. అదేవిధంగా ఇతర రాష్ట్రలు, దేశాల నుండి వచ్చిన చిత్రలేఖలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురికి పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ...చిత్రలేఖనంతో చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు తీసుకురావచ్చని ప్రతి ఒక్క విద్యార్థికి చిన్నప్పటి నుండే ఆర్ట్‌పై శిక్షణ ఇప్పించాలన్నారు. చిన్నారులకు సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్ వారు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. స్కూల్ రోజుల్లో నేనూ చిత్రలేఖనలో శిక్షణ పొందానని అనాటి గురువుని మళ్లీ ఈరోజు కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బిఎ రెడ్డి, సెక్రటరీ పద్మరెడ్డి, బిజెపి నేతలు మల్లారెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలంలో భవన నిర్మాణ వేస్టేజ్ డంపింగ్



టిప్పర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**కొంపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** శనివారం అర్ధరాత్రి మిథుల నగర్ సమీపంలోని ఖాళీ స్థలంలో టిప్పర్లతో భవన నిర్మాణ వేస్టేజ్, పెద్ద పెద్ద రాళ్ళను డంప్ చేస్తూ కాలుష్యం సృష్టిస్తున్న అలాగే అతి ప్రమాదకరంగా టిప్పర్లను నడుపుతూ చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బంది కలగచేస్తుండగా బాచుపల్లి పోలీసులు 3 టిప్పర్లను పట్టుకుని మున్సిపల్ అధికారికి జరిమాన విధించుటకై పంపడమైనది. శుక్రవారం కూడా 5 టిప్పర్లు పట్టుకుని 50వేల జరిమానా విధించడం తెలిసిన విషయమే.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్నారి విద్యార్థులు

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగాజరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగిన ఈ వేడుకలకు చిన్నారి బాలబాలికలు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో హాజరై సందడి చేశారు. ఈసందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా జరిగింది. పలువురు చిన్నారులు ఉట్టి కొట్టడానికి ఉత్సాహం చూపారు. శ్రీకృష్ణ జనా ్మష్టమి సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పండుగలపై విద్యార్థులకు అవగాహన కోసం కార్యక్రమాలు నిర ్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఎఒ, ఎడి, విపిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సకాలంలో రేషన్ బియ్యం సరఫరా చేయాలి

**రేషన్ డీలర్ల సంఘం**



పౌరసరఫరాల డిఎంను సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** రేషన్ షాపులకు ప్రతి నెలలో నిర్ణీత తేదీల్లో బియ్యం సరఫరా అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణను రంగారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంఘం కోరింది. జిల్లా డిఎంగా కొత్తగా బాధ్యతలు చేపట్టి గోపికృష్ణను జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు భానుచందర్, జిల్లా ఉపాధ్యక్షుడు, బాలాపూర్ మండల అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి తదితరులు కలిసి సన్మానించారు. అదే విధంగా ఇటీవల నూతనంగా వచ్చిన ఎఎస్ఒ గంపా శ్రీనివాస్ గుప్తను కూడా కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయానికి బియ్యం సరఫరా అయితే పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ రేషన్ డీలర్ల సంఘానికి చెందిన ఇరువెంటి సురేష్‌గుప్త, భాస్కర్‌రెడ్డి, భానుప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివనారాయణపురంలో పైప్‌లైన్ పనులు ప్రారంభం

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 22వ డివిజన్ శివనారాయణపురం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మంచి నీటి పైప్‌లైన్ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ లిక్కి మమతా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, గట్టు బాలకృష్ణ, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

# ఫార్మా కంపెనీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని

**తెలంగాణ ఫార్మా వ్యతిరేక పోరాట సమితి హెచ్చరిక**



మాట్లాడుతున్న యాకం యాదయ్య

**సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో గ్రామాలు, తండాలలో ఫార్మా కంపెనీలు స్థాపించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఫార్మా వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. లేనిపక్షంలో రైతుల పోరాటం, న్యాయ పోరాటం చేస్తామని సమితి హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోరాట సమితి ప్రతినిధులు మాజీ స్పరంచ్ యాకం యాదయ్య, సురేష్, చాకలి శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, ఆర్‌బి తండా, పులిచెర్ల కుంటతండా, ఈర్లపల్లి తండాలకు చెందిన 3వేల ఎకరాల పచ్చని పంటల భూమిలో రేవంత్‌రెడ్డి సోదరుడు, అల్లుడుకు సంబంధించిన బినామి పేర్లతో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి వికరాబాద్ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్లను కూడా జారీ చేయడం జరిగిందన్నారు. ఈ గ్రామాలు, తండాలలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తే పచ్చటి పోలాలు 1300 ఎకరాలు నాశనం అవుతాయని, కాలుష్యంతో గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చటి పొలాలపై ఆధారపడి దళిత, గిరిజన, బిసిలు వేలాది మంది రైతులు, కూలీలు తరతరాలుగా జీవనం పొందుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీలు తీసుకువచ్చి మాబ్రతుకులు నాశనం చేయవద్దని వారు సిఎంకు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పేరిట పచ్చటి పోలాలను నాశనం చేస్తే సహించేదన్నారు. తమ గ్రామాలు, తండాల చుట్టుపక్కల వేలఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, వాటిలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇక్కడ అభివృద్ధి చేయాలనుకుంటే ఐటి కంపెనీలు, వ్యవసాయాభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, మండలాధికారులకు వినతి పత్రాలను సమర్పించడం జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిని కాదని ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తే రైతులతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో రైతులు బిల్యా నాయక్, కమిలిబాయి, శాంతిబాయి పాల్గొన్నారు.



ప్రధాన మంత్రి పంపిన లేఖను చూపిస్తున్న పండితులు సుదర్శనాచారి

## వాస్తు, జ్యోతిష్య పండితుడు సుదర్శనాచారికి ప్రధాన మంత్రి మోది కృతజ్ఞతలు

**నాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మల్లాపూర్‌కు చెందిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య శాస్త్ర పండితులు, సామాజిక కార్యకర్త సుదర్శనాచారికి ప్రధాన మంత్రి నరేంద్రమోది నుంచి కృతజ్ఞతలు, అభినందనలు లభించాయి. ఈ మేరకు ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆయనకు రిజిస్టర్ పోస్టుకార్డు ద్వార వచ్చిన లేఖను అందుకుకొని ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ముందు చేపూరి సుదర్శనాచారి 2024 మే 8న ప్రధాన మంత్రికి ఒక ఉత్తరం రాశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో 300 ఎంపీ సీట్లు గెలుచుకొని ముచ్చటగా మూడో సారి మోది ప్రధాన మంత్రి కాబోతున్నట్లు ఇదే తన జ్యోతిష్యం అంటూ ఉత్తరం రాశారు. ఈ ఉత్తరానికి జవాబుగా ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి సుదర్శన్‌కు ప్రత్యుత్తరం అందింది. మీలాంటి వాళ్ల ఆశీస్సుల వల్లనే తాను మూడోసారి ప్రధానిని కాగలిగానని పేర్కొంటూ కృతజ్ఞతల చెబుతూ ఇలాంటి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రధాని ఉత్తరంలో రాశారు. అదేవిధంగా తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎం అవుతారని, ఏపీలో చంద్రబాబునాయుడు, మల్కాజిగిరి ఎంపీగా ఇటల రాజేందర్ గెలువబోతున్నట్లు వారికి గతంలో ఉత్తరాలు రాసినట్లు చెప్పారు. తాను చెప్పిన విధంగానే వారు సీఎంలుగా, ఎంపీగా ఇటల గెలుపొందారని ఆనందం వ్యక్త చేశారు.

## ఆధునిక గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నాం

**- బండ్లగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి**

**నార్సింగి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ గ్రామంలో ఆధునిక గ్రంథాలయ భవనంను నిర్మిస్తున్నామని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాల ముందు 250.గజాల స్థలంలో గ్రంథాలయ భవనంను నిర్మించేందుకు జేసీబీతో చదును చేయించారు. ఈ పనులను దగ్గరుండి రాజేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్షాకోట్‌లో వేగంగా జనాభా పెరిగిపోయిందని, కాలనీలు విస్తరించాయన్నారు. 90.శాతం వరకు చదువుకున్న వారే ఉంటున్నారని, వీరికి స్థానికంగా, రాష్ట్రంలో, దేశంలో, విదేశాలలో జరిగే సంఘటనలు తెలుసుకునేలా గ్రంథాలయంను నిర్మించబోతున్నామన్నారు. 250.గజాల స్థలంలో జి+1 భవనంను రూ.50.లక్షలతో నిర్మిస్తున్నామని వివరించారు. ఈ గ్రంథాలయం కాంపిటేషన్ పరీక్షలు రాసే విద్యార్థులకు, వృద్ధులకు, నిరుద్యోగ యువకులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, ఈ గ్రంథాలయాలలో లభించే పుస్తకాలు చదువుకొని ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, రాష్ట్రపతులు కూడా అయిన వారున్నారన్నారు. ఇంత మేలు చేసే గ్రంథాలయంను నిర్మించేందుకు శ్రీకారం చుట్టామని, త్వరలోనే పనులు పూర్తి చేసి, పాఠకులకు అందుబాటులోకి తీసుకు వచ్చేలా కృషి చేస్తామని పూలపల్లి రాజేందర్‌రెడ్డి వివరించారు. ఈ విషయం తెలుసుకున్న పాఠకులు, విద్యార్థులు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత టింకురెడ్డి, మాజీ వార్డు సభ్యులు రవికాంత్‌రెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

## హైడ్రా చర్యలను తప్పుపట్టడం సమంజసం కాదు

**సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** కొంత మంది నేతలు చెరువుల అక్రమణదారులకు వత్తాసు పలుకుతూ హైడ్రా చర్యలనున తప్పుపట్టడం సమంజసం కాదని, అవసరమైతే హైడ్రాకు మరింతగా చట్టబద్ద హక్కులు దక్కేలా కృషి చేయాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డవలప్‌మెంట్ కౌన్సిల్ రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేసింది. దశాబ్దాలుగా రాష్ట్రంలో వేల చెరువులు అన్యాక్రాంతం, అక్రమణలు జరిగి హైదరాబాద్ నగరంలో చినుకు పడితే వరద బీభత్సాలు జరుగుతున్న వైనం నాయకులు మరిచిపోవడం హాస్యాస్పదమని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీ హెచ్ రంగయ్య, జాతీయ సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, కన్వీనర్ ముదిగొండ త్యాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో వరద భయాన్ని నిలువరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రాను నిందించడం వారికి పర్యావరణపై అవగాహన లేదని చెప్పడానికి నిదర్శనమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సమర్థవంతమైన ఐఎఎస్ అధికారి ఆవుల వెంకటరంగనాథ్‌ను హైడ్రాకు కమిషనర్‌గా నియమించి అక్రమణకు గురైన చెరువుల్లోని కట్టడాలను కూల్చివేయడం సమర్థనీయమని, అయితే కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం నిందలు వేయడం తగదన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

## మోడీ సుపరిపాలనతోనే విజయం:ఈటెల

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ సుపరిపాలనతోనే మూడవసారి దేశంలో బిజెపి అధికారపగ్గాలు చేపట్టిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సామారంగారెడ్డి అధ్యక్షతన ఆదివారం దిల్‌సుక్‌నగర్‌లోని బృందావన్ హోటల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం 2024 లోక్సభ ఎన్నికలలో మూడవసారి కూడా అధికార పగ్గాలను చేపట్టి రికార్డు సృష్టించింది అన్నారు. రాష్ట్రంలోనే బీజేపీకి అత్యధిక మెజారిటీ ఇచ్చిన జిల్లా రంగారెడ్డి అర్బన్ జిల్లా అని జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డిని, కార్యకర్తలను అభినందించారు. సెప్టెంబర్ 1 నుండి ప్రారంభం అయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పోలింగ్‌బూత్ వారీగా 90శాతం సభ్యత్వ నమోదు చేయడమే జిల్లా ఎజెండా అన్నారు. సభ్యత్వ నమోదు చేయించే ప్రక్రియ కోసం ఎల్ఈడి స్క్రీన్‌పై సామ రంగారెడ్డి పవరపాయింట్ ప్రెసెంటేషన్ చేశారు. బిజెపి పాలనను ప్రజలకు తెలియజేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాతీయ దళితమోర్చా కార్యదర్శి ఎస్.కుమార్, కార్పొరేటర్లు పవన్‌కుమార్, వంగా మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగ నరసింహగుప్తా, కొప్పుల నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో తెలుగుభాషా ప్రస్తావన హర్షదాయకం

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 25 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ప్రసారమైన మన్‌కీ బాత్‌లో తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగువారికి శుభాకాంక్షలు తెలియజేయడంపట్ల తెలంగాణ సారస్వత పరిషత్తు హర్షం వ్యక్తం చేసింది. ప్రపంచంలోని తెలుగువారందరికీ ఇదొక గొప్ప గౌరవమని పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్యలు పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ సంఖ్యాకులు మాట్లాడే రెండవ అతిపెద్ద భాష తెలుగు అయినప్పటికీ జాతీయస్థాయిలో తెలుగువారు ఇంతకుముందు ప్రధానమంత్రులుగా, రాష్ట్రపతులుగా పనిచేసినప్పటికీ తెలుగుకు రావాల్సినంత గుర్తింపులేదని వాపోయారు. విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధిపొందిన ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా తెలుగుభాషా దినోత్సవాన్ని తెలుగుభాషలోనే గుర్తుచేయడం అత్యంత సంతోషదాయకమని అన్నారు. దీన్ని ప్రేరణగా తీసుకొని ఇకముందైనా ఉభయ తెలుగురాష్ట్రాలు తెలుగుభాషను ఇతోధికంగా ప్రోత్సహించాలని, తెలుగువారు ఎక్కడున్నా మాతృభాషను, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి తమ పిల్లలు కూడా ఆమార్గంలో పయనించేలా కృషిచేయాలని శివారెడ్డి, చెన్నయ్యలు కోరారు.

## తెలుగుజాతి కీర్తిని జాతీయస్థాయిలో నిలిచిన మహనీయుడు పింగళి వెంకయ్య

**చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య అని తెలంగాణ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య యాదిలో కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో ఎందరో మహనుభావుల మధుర స్మృతుల కార్యక్రమం గానసభలో అధ్యక్షుడు కళావిఎస్, జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడారు. జాతీయోద్యమం లోనేకాకుండా విద్య, శాస్త్రీయ రంగాల్లో దేశానికి సేవలందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అని అన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తి తెలుగుగడ్డపై జన్మించడం తెలుగుజాతి పుణ్యఫలమన్నారు. రెపరెపలాడే మువ్వన్నెల జెండా ఉన్నంతసేపు గుర్తుంచుకోవాల్సిన మహనీయుడు పింగళి వెంకయ్య అని, వందేమాతరం ఉద్యమం, హోంరూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యమకారుడు అని అన్నారు. కార్యక్రమంలో గో సంరక్షకులు గోపాలకృష్ణ, ప్రముఖ నిర్మాత, దర్శకులు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సంఘసేవకులు పిఎస్ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న సిరికొండ మధుసూదనాచారి, చిత్రంలో కళావిఎస్ జనార్దనమూర్తి

# డాక్టర్లు కనిపించే దేవుళ్లు : బండ ప్రకాష్



సేవారత్న పురస్కారగ్రహీతలతో బండప్రకాష్, వకుళాభరణం, దైవజ్ఞశర్మ, మల్లికార్జునరావు, రాఘవ

**రవీంద్రభారతి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** సమాజంలో వైద్యులకు, వైద్యరంగానికి ఎంతో ప్రాముఖ్యత, విశిష్టత ఉన్నదని, మానవసేవే మాధవ సేవ అనే భావంతో ప్రజలకు సేవలందిస్తున్న డాక్టర్లు కనిపించే దేవుళ్లని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. సమాజంలో ప్రజాసేవా ద్వారానే ఈ పురస్కారం వచ్చింది కనుక డాక్టర్లు తోడ్పాటును అందిస్తూ మున్ముందు మరింత సేవాభావం కనబరచాలని సూచించారు. డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ సమాజసేవలో విశ్వవ్యాప్తంగా ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్న మథర్ థెరిస్సా జయంతికి అదేకోవలో సేవలందిస్తున్న డాక్టర్లకు సేవారత్న పురస్కారాలతో సన్మానించి ప్రోత్సహించడం హర్షదాయక మని పురస్కార గ్రహీతలైన డాక్టర్లను, నిర్వాహకుడు మల్లికార్జునరావును అభినందించారు. భారత రత్న మథర్ థెరిస్సా 114వ జయంతి వేడుకలను పురస్కరించుకొని మథర్ ఫౌండేషన్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జునరావు నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన సేవా రత్న అవార్డులు 2024 కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండప్రకాష్, తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు విశిష్ట అతిథులు ఎర్ర లచ్చన్న, కంజర్ల ఈశ్వర్, డా. టి. ఆనందమూర్తి, విశ్వేశ్వరశర్మ, సంస్థ కార్యనిర్వహణ కార్యదర్శి రాఘవ, సాయినాథ్ తదితరులతో కలిసి వైద్యరంగంలోని వివిధవిభాగాల్లో విశేష సేవలం దిస్తున్న ప్రముఖులు 21మందిని ఘనంగా సత్కరించి వారి సేవకు గుర్తింపు, ప్రోత్సాహకంగా సేవారత్న అవార్డులను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు.



ఉమామహేశ్వర కాలనీ పర్యటిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్

## కొంపల్లిలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎంపి

**కొంపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపల్ పరిధిలో వరదల కారణంగా గురి అవుతున్న ఉమామహేశ్వర కాలనీతోపాటు పలు కాలనీలలో ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పర్యటిస్తూ, స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యతో పాటు డ్రైనేజీ వర్షంపడితే వరదలు వచ్చి ఉమామహేశ్వర కాలనీ ముంపుకు గురై చాలా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ప్రజలు తెలపడంతో ఆయన వెంటనే ఉన్నాతిధికారులకు ఫోన్‌లో సంభాషించి అక్కడి సమస్యలపై నివేదిక పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈటెల రాజేందర్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఓబీసీ ప్రధాన కార్యదర్శి సతీష్ సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కులగణనకు ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న**

# సంజయ్‌కుమార్ అరెస్టు



సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

**సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ అమలు చేయాలని, కులగణన ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదర్‌గూడలోని అజాద్ యూత్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఈ దీక్షా శిభిరాన్ని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ప్రారంభించారు. సంజయ్ కుమార్ ఆమరణ నిరాహారదీక్షకు వివిధ సంఘాల నాయకులు నల్ల సూర్య ప్రకాష్, బత్తుల సిద్ధేశ్వర్లు, కె.నరహరి, సి.హెచ్.కుమార్‌ఖద్గేరజక, కె.వనజ, దాసోజు లలిత తదితరులు సంఘీభావం తెలిపి, దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కులగణన చేపడతామని హామీ ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిందని, ఇంతవరకు ప్రక్రియ ప్రారంభించలేదని, మరొక ప్రక్క ఎన్నికలకు ఎన్నికల కమిషనర్ సమాయత్తం అవుతున్నారని ఆయన ఆరోపించారు. మంత్రి పదవులు, ఛైర్మన్ పదవులు ఇవ్వడానికి రాత్రికి రాత్రే నిర్ణయాలు తీసుకుటున్న ప్రభుత్వం కులగణన చేపట్టడానికి ఎందుకు జాప్యం చేస్తున్నదని ప్రశ్నించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కులగణన విషయంలో స్పష్టతో ఉన్నారని, సిఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ, బిసిలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కులగణన చేపట్టేంతవరకు ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

## అద్భుతమైన కళారూపాలకు పుట్టినిల్లు తెలంగాణ

**ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి**

**చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** అద్భుతమైన కళారూపాలకు పుట్టినిల్లు తెలంగాణ అని తెలంగాణ శాసనసభ తొలిస్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కళల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా జానపద కళాకారులచే నృత్యప్రదర్శనలు, ప్రముఖులకు 'ఐకాన్ అవార్డు'ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత మురళీమోహన్ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనచారి అవార్డులను ప్రదానం చేసి ప్రసంగించారు. ఐకాన్ అవార్డు గ్రహీతలు నర్ల సురేశ్, డాక్టర్ నల్లతీగ శ్రీనివాసాచార్యులు, డాక్టర్ పిట్ల అంజయ్య, మేడిశెట్టి వెంకటేశ్వర్లులను సత్కరించారు. 'కళ కళకోసం కాదు-సమాజహితం కోసం' అంశంపై కవిసమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో కుసుమ ధర్మన్న పీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, తెలంగాణ కళల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల శేఖరరావు, ప్రధాన కార్యదర్శి అందే శ్రీధర్‌రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ వేణుగోపాలశర్మ, తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలను ప్రదానం చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

## టిప్పర్‌లారీ, కళాశాల బస్సు మధ్య ఇరుక్కుని టిప్పర్ డ్రైవర్ మృతి

**హయత్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు టిప్పర్‌లారీ, కళాశాల బస్సుకు మధ్యలో ఇరుక్కుపోయి టిప్పర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... పెద్దఅంబర్‌పేటకు చెందిన శెట్టిరాజేష్(38)టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 24 అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు 2 గంటలకు అతను తన టిప్పర్ లారీ(టిఎస్30టి 5333)ను పెద్దఅంబర్‌పేట సమీపంలోని గజ్జిస్వామి పార్కింగ్ యార్డులో పార్కింగ్ చేయడానికి వెళ్లాడు. పార్కింగ్ యార్డు గేటు మూసి ఉండడంతో దానికి తీసేందుకు అతను టిప్పర్‌ను గేటు ముందు నిలిపి గేటు వద్దకు వెళ్లాడు. టిప్పర్ హ్యాండ్‌బ్రేక్ వేయడం మర్చిపోవడంతో అది ముందుకు కదలింది. దానికి ఆపేందుకు అతను యత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈక్రమంలో యార్డులో పార్కింగ్ చేసిఉన్న కళాశాల బస్సుకు టిప్పర్ లారీకి మధ్యలో అతను ఇరికిపోయి తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పంపించి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని ఓ వ్యక్తిని ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిందూబాల పెట్రోల్ పంపు ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి సుమారు 45 సంవత్సరాలు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఆగస్టు 14వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి 100కు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలు పాలైన ఆ వ్యక్తిని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బిపిమండల్ ఆశయ సాధనకు నడుం బిగించాలి

## జయంతి వేడుకల్లో వక్తల పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త: దేశంలో అత్యధిక జనాభా కలిగిన బిసిల స్థితి గతులను మార్చేందుకు తుదివరకు పోరాడిన బిపి మండల్ ఆశయసాధనకు నడుం బిగిద్దామని వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మండల్ 106వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు దేవళ్ల సమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ తిరుమలి, ఉద్యోగ సంఘాల నాయకులు వినోద్, చారి, పృధ్వీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగాఉన్న బిసిలు ఇప్పటికీ అనచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1993 వరకు జాతీయ స్థాయిలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించకుండా తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. 2008 వరకు జాతీయ విద్యాసంస్థలైన సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐటి, ఎన్ఐటి వంటి వాటిల్లో బిసిలకు ప్రత్యేక రిజర్వేషన్ లేదన్నారు. సంపద సృష్టిస్తున్న వర్గాలకు అన్యాయం జరుగుతున్న విధానాన్ని గమనించిన బిపిమండల్ ఉద్యమాల ఫలితంగానే విద్యా ఉద్యోగ రంగాలల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయని అన్నారు. ఇంకా చాలావరకు ఆయన చేసిన సూచనలు అమలు చేయకుండా అగ్రవర్ణ పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. బిసి సామాజిక వర్గ ప్రజలకోసం ఆయన ముఖ్యమంత్రి పదవిని సైతం త్యాగం చేసిన విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈనేపథ్యంలోనే బిసిలు రిజర్వేషన్లు రాజకీయ అధికారంపై విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర స్థాయిలో విస్తృతమైన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ద్వారా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.



మండల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ తిరుమలి తదితరులు



ఎమ్మెల్యే తలసానికి ప్రసాదం అందజేస్తున్న ఓదెల సత్య నారాయణ

## గణేష్ దేవాలయం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: సికింద్రాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ గణపతి దేవాలయం అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గణేష్ దేవాలయం నిర్మించి 200 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ నెల 15 నుంచి 19 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే తలసానిని తన నివాసంలో కలిసి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓదెల సత్య నారాయణ, ధర్మకర్తలు ఎం.హన్మంత్ రావ్ యాదవ్, వినోద్‌కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సిఐ



మాట్లాడుతున్న మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సోముల వెంకటేశ్ తదితరులు

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సోముల వెంకటేశ్ సూచించారు. ఆదివారం గణేష్ మండపాల నిర్వాహకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. గణేష్ మండపాల వద్ద నియమ నిబంధనల ప్రకారం నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కోర్ కమిటీ కన్వీనర్ కపిల్ బరాబరి, ప్రతినిధులు నాగభూషణ్‌రెడ్డి, శరత్ ఠాకూర్, సచిన్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి: రామక్రిష్ణ

కంటోన్మెంట్, ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బిజెపి బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహేంద్రహిల్స్‌లోని సంజీవ్ కో-అపరేటీవ్ సొసైటీ కాలనీలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెచ్చినట్లైతే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. వరదనీటి ప్రవాహంతో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సినీ డైరెక్టర్ కోటేశ్వర్ రావ్, సంజీవ్ కో-అపరేటీవ్ సొసైటీ ప్రతినిధులు నరేశ్ బండి తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల పనులకు శంకుస్థాపన

జియాగూడ, ఆగస్టు 24 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న రహదారులను పనులను వెంటనే చేపట్టడం జరుగుతుందని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు. డివిజన్ పరిధిలోని భైరూపియా గల్లీలో నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 20 సంవత్సరాల నుంచి అనేక అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మజ్లీస్ నాయకులు కె.శ్రీనివాస్, జిహెచ్ఎంసి డిఇ సంగప్ప పాల్గొన్నారు.

## క్రిష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం : సంతోష్ యాదవ్

కంటోన్మెంట్, ఆగస్టు 25 ప్రభాతవార్త: శ్రీక్రిష్ణాష్టమిని పురస్కరించుకొని ఈ నెల 27న వెస్ట్ మారేడ్‌పల్లిలో శ్రీక్రిష్ణ రథయాత్ర వేడుకలు భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కంటోన్మెంట్ యాదవ సంఘం అధ్యక్షుడు, సుబ్రమణ్య స్వామి దేవాలయం మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్‌యాదవ్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా మారేడ్‌పల్లిలో శ్రీ క్రిష్ణ జన్మాష్టమి వేడుకలు భారీఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. అదే తరహాలో ఈ నెల 27న సాయంత్రం పూజలు నిర్వహించి రథయాత్ర వేడుకలు భారీ ఊరేగింపుతో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కలకత్తా లైటింగ్ సిస్టమ్‌తో మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా స్వాగత వేదికలు, కటౌట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొనున్నట్లు సంతోష్ యాదవ్ తెలిపారు.

## గాయత్రి పొదుపు సంఘం 24వ వార్షికోత్సవం

అత్తాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ ఆదర్శ కాలనీలోని శ్రీగాయత్రి పొదుపు సంఘం 24వ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయం బాధ్యతలు ఆస్తులు పట్టికను సంఘం కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, గుమస్తా గంజి మార్కండేయ సంఘం సభ్యులకు తెలియజేశారు. ఇతర అంశలను అధ్యక్షుడు యేదిరే అనుమతితో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..2000 సంవత్సరంలో నలుగురు సభ్యులతో ప్రారంభించి 900 మంది సభ్యులతో 5 కోట్ల టన్నోవర్‌తో సంఘం నడుస్తుందన్నారు. సొంత భవనంతో సిసి కెమెరాల నిఘాతో దినం దినం సంఘాన్ని అభివృద్ధి చేసుకోవడం సంఘం సభ్యుల విజయమని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యేదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దళపతి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శి దళపతి రాజు, పాలకవర్గ సభ్యులు, కూడికల ప్రభాకర్, గాజుల సురేష్, ముదిగొండ సత్యనారాయణ, మసినీ వనజ గుమస్తాలు గంజీ మార్కండేయ నామని రాకేష్ పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో ఇండక్షన్ దినోత్సవం..

నిజాంపేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త : బాచుపల్లిలో బివిఆర్ఐటి హైదరాబాద్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరపు విద్యార్థినులకు స్వాగతం చెబుతూ ఇండక్షన్ రోజును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కె.ఆదిత్య విస్సం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను ఆసక్తితో నేర్చుకోవాలని తెలిపారు. సాంకేతికత రోజురోజుకి కొత్తరూపం తీసుకుంటున్న ఈ తరుణంలో విద్యార్థులు పరిశ్రమకు సిద్ధంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. మహిళా సాధికారతే తమ కళాశాల ఉద్దేశ్యం అని తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థినులను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం విష్ణు సక్సెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని, విద్యార్థినులకు అన్ని విధాలుగా సహకారం అందించి వరకు విజయపదం వైపు తీసుకెళ్లడమే ఈ సెంటర్ లక్ష్యమని తెలిపారు. ప్రిన్సిపాల్ డా.కెవిఎన్ సునీత మాట్లాడుతూ తమ కళాశాల ఎంచుకున్నందుకు హర్షం వ్యక్తపరిచారు. తల్లిదండ్రులకు తమ పిల్లల భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు. అనంతరం మొదటి సంవత్సర విద్యార్థినులకు పుస్తకాల కిట్‌ను అందించారు.

## పేద వధువులకు అండగా ఉంటాం: ఉప్పల

ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త: నిరుపేద వధువులకు తాము అండగా నిలుస్తామని ఐవిఎఫ్ చైర్మన్, కాంగ్రెస్ ప్రచారకమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంపు కార్యాలయంలో సీతాఫల్‌మండికి చెందిన పక్షవాతంతో బాధపడుతున్న మల్లమ్మ, రాజయ్య కుమార్తె బబిత వివాహానికి పుస్తేమట్టెలు, చీర, గాజులు, దుస్తులను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

## సిఎంపై విమర్శలు మానుకోవాలి:దేప భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు మానుకోవాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆర్కేపురం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం ఆర్కేపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి అమలు చేస్తున్న పథకాలు ఇష్టం లేక కుమ్మక్కైన బీజేపీ, బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, అధికారం కోల్పోయిన బాధలో మాజీమంత్రి కేటీఆర్ ఆడపడుచులపై నోరు వారేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. చెరువులను కబ్జా చేసిన వారి కోరలు పీకేందుకే సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైడ్రా ఏర్పాటు అయిందని అన్నారు. బీజేపీకి మతరాజకీయాలకు తప్పా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పిట్ట హరినాథ్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు తలాటి రమేష్‌నేత బొడ్డుపల్లి మహేందర్, లింగస్వామి గౌడ్, యాదవరెడ్డి, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, పగడాల శ్రీశైలం, ఇస్మాయిల్, పటేల్, జయశ్రీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గ్లోబల్ కన్వెన్షన్-2024

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సెప్టెంబరు 15న గ్లోబల్ కన్వెన్షన్-2024కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహాసభ మీడియా కమిటీ చైర్మన్ కౌటికె విఠల్ వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక శాఖ మంత్రి టిజి.భరత్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవవేత్త, మహాసభ గ్లోబల్ చైర్మన్ టిజి.వెంకటేశ్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్నో రకాల తీర్మాణాలుంటారని, ఎన్నో జ్ఞాపకాలను ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని ధృఢసంకల్పంతో మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ఎందరినో సలహాలు తీసుకుంటూ ముందుకు వెడుతున్నారన్నారు. మహాసభ గ్లోబల్ నాయకులు, జాతీయ నాయకులు, వివిధ రాష్ట్రాల నాయకులు, జిల్లా నాయకులు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఏమాత్రం అవకాశం ఉన్నా ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఆర్యవైశ్యులదరు ఒకేచోట కలుసుకునే అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు ఇది మంచి అవకాశం అని అన్నారు.

## మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్‌పై కెటిఆర్ వ్యాఖ్యలు నిరాధారం

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేశ్

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధు యాష్కీగౌడ్‌పై బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బొంగు వెంకటేశ్ అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి అప్పన్నంగా అక్రమార్గాన ప్రభుత్వభూములు ఆక్రమించి కోట్ల రూపాయాలు సంపాదిచారని, కాని మధుయాష్కీగౌడ్ రాష్ట్ర సాధన కోసం అధికార పార్టీని ఎదిరించి రాష్ట్రం కోసం నిలబడిన వ్యక్తి అని అన్నారు. అలాంటి మచ్చలేని నాయకుడిపై ఫామ్ హౌజ్‌లున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తండ్రి కెసిఆర్‌ను అడ్డుపెట్టుకుని కెటిఆర్ రాజకీయాలలోకి వచ్చారని, కాని మధుయాష్కీగౌడ్ స్వతహాగా రాజకీయాలలోకి వచ్చి రెండుసార్లు ఎంపి అయిన విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. కెసిఆర్, కెటిఆర్ కుటుంబమంతా పదేళ్ళు తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని గుర్తు చేశారు. కెటిఆర్‌కు మాదిరిగా జన్వాడలో ఫామ్‌హౌజ్‌లు లేవని, 111జీవోకు వ్యతిరేకంగా ఫామ్‌హౌజ్‌లు నిర్మించారని ఆరోపించారు. నిరంతరం ప్రజలమద్యన ఉండే మధుయాష్కీగౌడ్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుని నిజాలు మాట్లాడితే బాగుంటుందని, మరోసరి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## విద్యార్థి ఉద్యమ కారులను గుర్తించండి

### ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు

తార్నాక, ఆగస్టు 25 ప్రభాతవార్త: విద్యార్థి ఉద్యమకారులను గుర్తించాలని పలువురు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ కారులు ప్రభుత్వాన్ని ముక్త కఠంతో కోరారు. ఆదివారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్‌లో కాంగ్రెస్ విద్యార్థి ఉద్యమకారుల సదస్సు భట్టి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. సదస్సుకు వక్తలుగా డా. పిడమర్తి రవి, లోకేష్‌యాదవ్, చరణ్ కౌశిక్‌యాదవ్, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కృష్ణకాంత్, కేతూరి వెంకటేష్, దరువు ఎల్లన్న, మందాల భాస్కర్, మానవతా రాయ్, బొమ్మ హన్మంత్‌రావు, వరంగల్ రవి, రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్ సతీష్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఓ.యూనుంచి ఎంతో మంది విద్యార్థినేతలు ఉన్నారని వారిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ సదస్సులో ఏకగ్రీవంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి మండలికి జాబ్ కేలండర్‌ను ప్రకటించిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిదంగా రైతు రుణమాఫి రూ. 2లక్షలు చేయడాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు చెప్పారు. త్వరలో విద్యార్థి ఉద్యమ కారుల బృందం సీఎం, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులను కలువనున్నట్లు చెప్పారు. ఉద్యమకారులకు 10కార్పోరేషన్ చైర్మలు, 2ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుడు, జిల్లా చైర్మన్‌లు, కమిషన్ మెంబర్‌లుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఉద్యమ కారులకు కేటాయించే 250 గజాల ఇంటి స్థలం ఓ.యూ ఉద్యమకారులకు హైదరాబాద్‌లో కెటాయించాలని విజ్ఞప్తి చేశారు.



ఆర్ట్స్ కాలేజ్‌లో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ విద్యార్థి ఉద్యమ నాయకులు



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సమస్యలు వివరిస్తున్న పోల్కం శ్రీనివాస్

## జలమండలిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి

మలక్‌పేట, ఆగస్టు 25 ప్రభాతవార్త: జలమండలిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి జలమండలిలో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే విచారణ నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ చేసి టెండర్ వర్క్‌ని పొడిగించకుండా ప్రజాధనాన్ని కాపాడాల్సినబాధ్యత ప్రజలపై, కార్యకర్తలపై ఉందన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి:సురేష్



వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

మలక్‌పేట, ఆగస్టు 25 ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెంపపేట డివిజన్ విద్యుత్ శాఖ డిఈ సురేష్ పేర్కొన్నారు. వనస్థలిపురం సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ లలిత, మెంబర్ ఫైనాన్స్ శోభ రాణి లకు పలువురు వినియోగదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి రామచందర్ పాల్గొన్నారు.

## వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు : ఎమ్మెల్యే

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: నిత్యవ్యాయామం ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి తెలంగాణ దశాబ్ది పార్కులో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించి ప్రసంగించారు. నియోజకవర్గంలోని ప్రజలు అహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో ఈ జిమ్‌ను ప్రారంభించామని, ప్రతి ఒక్కరు నిత్యవ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో ప్రతి పార్కులో ఓపెన్ జిమ్ సౌకర్యంతో పాటు ఔషద మొక్కలు పెంపుదలకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాగ్‌లింగంపల్లి ఎంఐజి-2 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, బిఆర్ఎస్ సీనియర్ నేతలు బబ్లూ, దామోదర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శంకర్, శేషయ్య, జార్జ్, రామచంద్రారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్వీ.రమణారావు, కోశాధికారి ఎంజె.జోసెఫ్, బిఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి రాధాకృష్ణ దేవాలయంలో 13వ వార్షికోత్సవ వేడుకలు

మెహిదీపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త : కార్వాన్ గిరకపల్లిలోని అన్నపూర్ణ స్థలంలో కొలువుదీరిన రాధాకృష్ణ దేవాలయంలో నేటి నుంచి 13వ వార్షికోత్సవ వేడుకలతో పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను రెండు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధ్యక్షులు ఎస్.బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకము, అలంకారము, గణపతి పూజ, పుణ్యాహవాచనము, మండపారాధన, హోమాలు, పూర్ణాహుతి, ప్రసాదవితరణ, మంగళహారతి, మంత్రపుష్పము, శ్రీకృష్ణసహస్ర నామాలు, అన్నదానం సాయంత్రం స్వామివారి ఊరేగింపు దేవాలయం నుండి ప్రారంభమై మోహినీ ఫంక్షన్ హాల్, విశ్వేశ్వర్‌నగర్, విరాట్‌నగర్, శారదానగర్, తాళ్లగడ్డ, కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయం నుండి ఆలయంకు చేరుకుంటుందని తెలిపారు. మంగళవారం గోపూజ, శ్రీకృష్ణామిని పురస్కరించుకొని శ్రీ కృష్ణ భగవానుడికి ఇష్టమైన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానిక పరిసర ప్రాంతాల భక్తులు ఈ వేడుకల్లో పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### కార్వాన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో..

కార్వాన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం సాయంత్రం విశ్వేశ్వర్‌నగర్‌లోని శ్రీ కృష్ణభవన్ వద్ద అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆసంఘం అధ్యక్షులు బోడి అశోక్‌కుమార్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, హవన కార్యక్రమం, గోపూజ, విద్యార్ధులకు బహుమతుల ప్రధానోత్సవం, శ్రీకృష్ణ డోలారోహనం, ఉట్టికొట్టె కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు యాదవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## దశలవారిగా కాలనీల సమస్యలను పరిష్కరిస్తా

వనస్థలిపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో సమస్యలను దశలవారిగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని బి.ఎన్.రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధి సౌభాగ్యనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రహారీ గోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత, శ్రీదర్‌రావు, కాలనీఅధ్యక్షులు ఆంజనేయులు, ప్రతినిధులు లక్ష్మణ్, సురేష్, చిత్తరంజన్ పాల్గొన్నారు.

## నేడు హరిహర కళాభవన్‌లో "శ్రీకృష్ణ జయంత్యుత్సవం"

### యాదవ మహాసభ అధ్యక్షులు యల్లావుల చక్రధర్‌యాదవ్

హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం (నేడు )సాయంత్రం 7గంటలకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు యల్లావుల చక్రధర్‌యాదవ్ తెలిపారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను పలువురు యాదవ ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రముఖులతంతా హాజరు కానున్నట్లు తెలిపారు. నేడు అత్యంత వైభవంగా జరిగే ఈకార్యక్రమానికి జంట నగరాలకు చెందిన యాదవులంతా కుటుంబ సమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగెల్లి అంజన్‌యాదవ్, జంగిటీ ప్రవీణ్‌యాదవ్, ఎంబి కృష్ణయాదవ్, మెడికె శ్రీనివాసులు, కీర్తి సుధాకర్‌యాదవ్, రాంప్రసాద్ యాదవ్, ఉడత పరమేశ్వర్ యాదవ్, బొట్టు మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సాయి రాజేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న జంపన ప్రతాప్, ఎం.మధుకర్

## కంటోన్మెంట్ క్రీడాకారులకు చేయూత : జంపన ప్రతాప్

కంటోన్మెంట్, ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ప్రాంతంలో క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించేందుకు స్పోర్ట్స్ అసోసియేషన్ ఎల్లప్పుడు ముందుంటుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. నగరంలోని దూల్ పేట మినీ స్టేడియంలో ఈ నెల 19, 22 తేదీల్లో జరిగిన కుస్తీ పోటీల్లో బోయిన్‌పల్లికి చెందిన బోయిని సాయిరాజేశ్‌యాదవ్ 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఆయనను ఆదివారం కంటోన్మెంట్ బోయిన్ పల్లి పే ల్ల గ్రౌండ్‌లో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్, రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, బోయిన్‌పల్లికి చెందిన నాయకులు బోయిని రాజు యాదవ్, ముఖేశ్ యాదవ్, వాసు ఫైల్ వన్, విఠల్ యాదవ్, ఓంప్రకాశ్ యాదవ్, కట్టెల మండి కుమార్, హరి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్ సర్కిల్ 14 ఏఎంహెచ్‌ఓగా డాక్టర్ వెంకటరమణ

గోషామహల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలోని బస్తీల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని జిహెచ్ఎంసి సర్కిల్ 14 ఏఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరణమణ అన్నారు. ఇక్కడ విధులను నిర్వహించిన డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో డాక్టర్ వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో పారిశుధ్య పనులు, నిర్వహణ తీరుపై స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. అలాగే సీజనల్, వ్యాధులపట్ల ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్కిల్ పరిధిలో విధులను నిర్వహించే ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



సంకీర్తన్ యాదవ్‌కు మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

## కుస్తీ పోటీలలో తోట సంకీర్తన్‌యాదవ్‌కు గోల్డ్ మెడల్

ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త: లాలాకేసరి స్టేట్ లెవెల్ కుస్తీ పోటీలలో 70 కేజీల కేటగిలలో కొత్తపేటకు చెందిన తోట సంకీర్తన్‌యాదవ్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జైభవాని వ్యాయామశాల లాలాపహిల్వాన్, బాలాజీసింగ్‌పహిల్వాన్ మెమోరియల్ వెర్స్లింగ్ టోర్నమెంట్ 2024 సంబంధించి దూల్‌పేట్ జాలిపేట్ హనుమాన్ విగ్రహాల దగ్గర అట్టహాసంగా కుస్తీపోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో పోటాపోటీగా జరిగిన ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరసనంతో సంకీర్తన్‌కు గోల్డ్ మెడల్ దక్కింది. ఈ సందర్భంగా జైభవాని వ్యాయామశాల నిర్వాహకులు అర్జున్‌పహిల్వాన్, జైహింద్‌పైల్వాన్ పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గోల్డ్ మెడల్ సాధించిన సంకీర్తన్ యాదవ్‌కు తోట మహేష్‌యాదవ్, కోచ్ మోతిబాయ్ పుష్పగుచ్చాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు.

## కాలనీ భవనానికి నిధులు కేటాయించాలి: అరవింద్‌శర్మ

ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డునెంబర్ 1లోని కాలనీ అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలని మహేశ్వరం నియోజకవర్గము బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి మంజూరు చేసిన నిధులతో జరుగుతున్న సరస్వతీనగర్‌కాలనీలోని రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రి హోదాలో సబితాఇంద్రారెడ్డి భవనానికి రూ. 35 లక్షలు కేటాయించాలని, నిధులు సరిపోక పనులు ఆగిపోవడంతో అవసరమైన నిధులు కేటాయించాలని అధికారులను ఎమ్మెల్యే సబిత ఆదేశించారని తెలిపారు. చిన్నపాటి వర్షానికే సరస్వతి దేవాలయం రోడ్డు నీటమునిగి దేవాలయంలోకి, ఇండ్లలోకి నీరు చేరుతుందడంతో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి రూ.44లక్షలు మంజూరు చేశారని, త్వరలో రోడ్డుపనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, శ్యాంగుప్త, కపిల్ పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు కూల్చివేయడాన్ని స్వాగతిస్తున్నాం : కార్పొరేటర్

ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త: హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆమె సరూర్‌నగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను కబ్జా చేసిన వారికి భవన నిర్మాణాల కోసం అనుమతి ఇచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని





నగరంలో ఆదివారం నెక్లెస్ రోడ్డు నుంచి గచ్చిబౌలి వరకు సాగిన 13వ ఎడిషన్ హైదరాబాద్ మారథాన్-2024లోపాల్గొన్న క్రీడాభిమానులు


CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I Deviki Rochiram Bhatia D/o Rochiram Bhatia born on 10/08/1955, Residing at A308 Mahindra Ashvita Life Spaces, Hafeezpet Road, Near Hitech City MMTS Kukatpally Medchal Malkajgiri District 500085 Have changed my name to Deviki Kishore Bhatia vide affidavit dt 23/08/2024 at Hyderabad. (Ro.No.21209)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

